జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

సోమవారం | 6-4-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 636 పేజీలు: 4 వెల : రూ.7



# కన్నకొడుకే.. కాలయముడు

✳ లోహరిబందలో దారుణహత్య ✳ తండ్రిని కడతేర్చిన కుమారుడు
✳ ఉద్దానంలో ఘటన ✳ దర్యాప్తు చేస్తున్న మందస పోలీసులు

మందస, ఏప్రిల్ 5(వార్త): తండ్రిని కన్న కుమారుడు హతమార్చిన ఘటన ఉద్దానంలో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను మందస పోలీసులు విలేకరులకు వివరించారు. మందస మండలంలోని లోహరిబంద గ్రామానికి చెందిన తాళ్ల లక్ష్మీనారాయణ (65) సామాన్య రైతు కుటుంబం. ఆయనకు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్దకుమారుడు ఏకాంబరం సంపాదన లేకుండా తిరుగుతున్నాడు. చెడు అలవాట్లకు బానిసయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులతో తరచూ వివాదాలు జరిగేవి. లక్ష్మీనారాయణకు ఆపరేషన్ జరగడంతో మంచంపై ఉన్నాడు. కాలు, చేతులు లేవలేనిస్థితి. ఈ తరుణంలో ఆదివారం ఉదయం లక్ష్మీనారాయణ, ఆయన భార్య దయమంతి, కుమారుడు ఏకాంబరం ఇంటిలోనే ఉన్నారు. లక్ష్మీనారాయణ భార్య దమయంతి ఇంటి నుంచి వేరే పనిపై బయటకు వెళ్లింది. ఆ సమయంలో ఏం జరిగిందో.. ఏమో కానీ.. లక్ష్మీనారాయణ రక్తపు మడుగులో పడి ఉన్నాడు. అదే ఇంటిలో చిన్నకుమారుడు, కోడలు మేడపై ఉన్నారు. శబ్దాలు విని కిందకు వచ్చేసరికి లక్ష్మీనారాయణ మృతి చెందివున్నాడు. దీంతో వారు మందస పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని, శవ పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హరిపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. కాగా.. లక్ష్మీనారాయణ కుమారుడు ఏకాంబరమే ఈ హత్య చేసినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. కుమారుడు ఏకాంబరం.. తండ్రి లక్ష్మీనారాయణ తలను గోడకు గుద్ది, గట్టిగా కొట్టడం వల్ల మృతి చెందివుంటాడని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కృష్ణప్రసాద్ చెప్పారు.



## పిడుగు పాటుకు..
# తల్లీ, కుమార్తె దుర్మరణం

✳ పెద్దకేశుపురంలో జీడి పిక్కలు ఏరుతుండగా పిడుగులు
✳ అక్కడికక్కడే ఇరువురు మృతి ✳ కన్నీరుమున్నీరైన కుటుంబీకులు
✳ ఇటీవల పది పరీక్షలు రాసిన లోకేశ్వరి





మందస, ఏప్రిల్ 5(వార్త): మందస మండలంలోని ఉద్దాన ప్రాంతమైన నారాయణపురం పంచాయతీలో గల పెద్దకేశుపురంలో పిడుగు పాటుకు తల్లీ, కుమార్తె దుర్మరణం పాలయ్యారు. తోటలో పనులకు వెళ్లిన వారిద్దరిపై పిడుగు పడడంతో అక్కడికక్కడే మరణించారు. వివరాలిలా ఉన్నాయి. పెద్దకేశుపురం గ్రామానికి చెందిన మడియా కృష్ణవేణి, ఆమె కుమార్తె లోకేశ్వరి జీడితోటలో పిక్కలు ఏరడానికి వెళ్లారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి ఈ ప్రాంతంలో వాతావరణం మార్పులు చోటు చేసుకున్నాయి. సాయంత్రానికి ఈదురుగాలులు వీచాయి. ఉరుములు, మెరుపులు ప్రారంభమయ్యాయి. తోటలో జీడిపిక్కలు ఏరడంతో పాటు పశువులశాలలో ఉన్న పశువులకు నీరు పెట్టడానికి వెళ్లిన కృష్ణవేణి, ఆమె కుమార్తె లోకేశ్వరి ఓ చెట్టు వద్ద ఉండగా.. అదే చెట్టుపై పెద్ద శబ్దంతో పిడుగు పడింది. దీంతో వారిద్దరూ అక్కడికక్కడే మరణించారు. కృష్ణవేణి సాధారణ గృహిణి కాగా, లోకేశ్వరి(చిన్ని) 10వ తరగతి పరీక్ష రాసింది. పిడుగు శబ్దానికి అదిరిపడిన కుటుంబీకులు వీరి కోసం తోటలోకి వెళ్లారు. చెట్టు కింద తల్లీ, కుమార్తెలు విగత జీవులుగా పడి ఉండడాన్ని గమనించి కన్నీరుమున్నీరుగా విలపించారు. కృష్ణవేణి భర్త మధుసూదనరావు ఇటీవలే మరణించారు. పెద్ద కుమార్తె లక్ష్మికాంతం ఇంటిలో ఉంది. కుటుంబంలో ముగ్గురు మరణించడంతో లక్ష్మికాంతం ఒంటరయ్యింది. అప్పటి వరకు తమ కళ్ల ముందే తిరిగిన కృష్ణవేణి, లోకేశ్వరిలు పిడుగుపాటు గుర్రై, మరణించడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. మందస పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలకు పోస్టుమార్టం నిమిత్తం హరిపురం సామాజిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు.



## దేశ గమనాన్ని మార్చిన నాయకుడు..
# జగజ్జీవన్ రామ్



✳ ఆయన ఆశయాల సాధనే అసలైన నివాళి ✳ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ✳ ఘనంగా బాబు జగజ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలు

**శ్రీకాకుళం, ఏప్రిల్ 5(వార్త):** దేశ గమనాన్ని మార్చిన గొప్ప నాయకుడు డాక్టర్ బాబు జగజ్జీవన్ రామ్ అని, ఆయన ఆశయాలను ప్రస్తుత కూటమి ప్రభుత్వం అక్షరాలా అమలు చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఆదివారం శ్రీకాకుళం నగరంలో బాబు జగజ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించింది. మొదటగా మిల్లు జంక్షన్ వద్ద ఉన్న బాబు జగజ్జీవన్ రామ్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సన్ రైజ్ కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సభలో జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రక్షణ, వ్యవసాయ, కార్మిక శాఖల మంత్రిగా జగజ్జీవన్ రామ్ దేశానికి చేసిన సేవలు అనన్యసామాన్యమన్నారు. ఆహార సంక్షోభ సమయంలోనూ, యుద్ధ కాలంలోనూ ఆయన చూపిన సమర్థత మరువలేనిదన్నారు. కూటమి ప్రభుత్వం వివక్షత లేని పాలన అందిస్తోందని, గతంలో పున్నయ్య కమిషన్ 42 సిఫార్సుల్లో 27 జీవోలను అమలు చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. 29 ఎస్సీ, ఎస్టీ స్థానాల్లో 27 చోట్ల కూటమి గెలవడం ప్రజల విశ్వాసానికి నిదర్శనమని, అడిగిన సైట్ విషయమై పరిశీలిస్తున్నామని, ఇప్పటికే అంబేద్కర్ ఆడిటోరియంను బాగు చేసి బీసీ భవన్‌ను నిర్మించామని వెల్లడించారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ.. 1905లో జన్మించిన జగజ్జీవన్ రామ్ స్వాతంత్ర సమరయోధునిగా, కేంద్ర మంత్రిగా, ఉప ప్రధానిగా దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ముఖ్యంగా వ్యవసాయ, రక్షణ శాఖల మంత్రిగా ఆయన చూపిన చొరవ అద్భుతమని పేర్కొన్నారు. నేటి యువత, విద్యార్థులు బాబుజీని స్ఫూర్తిగా తీసుకుని విద్యావంతులుగా ఎదిగి, ఉన్నత పదవులను అధిష్టించాలని ఆకాంక్షించారు. శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్ మాట్లాడుతూ.. జగజ్జీవన్ రామ్ 50 ఏళ్లు ఎంపీగా, 30 ఏళ్లు కేంద్ర మంత్రిగా ఉండి కార్మిక శ్రేయస్సు కోసం అనేక చట్టాలు తెచ్చారని కొనియాడారు. కమ్యూనిటీ హాల్ మంజూరు విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే సాధిస్తామని చెప్పారు. హరిత విప్లవం, ఇండో-పాక్ యుద్ధ సమయంలో ఆయన పాత్రను ఆర్డీవో సాయి ప్రత్యూష వివరించగా, కనీస వేతనాల చట్టం ఆయన కృషేనని మున్సిపల్ కమిషనర్ కూర్మారావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి విశ్వేశ్వరరావు, ఎస్.సి కార్పొరేషన్ ఈడి వినాయకం, పి.ఎం.జె బాబు, మాదరపు వెంకటేష్, రమణ మాదిగ, ఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షులు రాయి వేణుగోపాల్, ప్రొఫెసర్ ఎం. చిన్నారావు, వి. యాదగిరి, వేణు, హేమ సుందర్ తదితర అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

### నేరడి బ్యారేజీని నిర్మిస్తాం

శ్రీకాకుళం జిల్లాకు అత్యంత ప్రాధాన్యమైనటువంటి వంశధారతో జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు నేరడి బ్యారేజీని కూటమి ప్రభుత్వం హయాంలో నిర్మాణం పూర్తి చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ప్రతి ఎకరాకు సాగునీరు, తాగునీరు అందిస్తామన్నారు. బాబు జగజ్జీవన్ రామ్ 119వ జయంతి అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి కారణంగా బ్యారేజీ సమస్యను పరిష్కరించలేకపోయారని విమర్శించారు. వైకాపా హయాంలో నిపుణులైన న్యాయవాదులను నియమించకపోవడంతో సమస్య పరిష్కారం జరగలేదని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సంబంధిత విషయాన్ని కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ దగ్గరకు తీసుకెళ్లి పరిష్కరించడంలో తమదైన చొరవ చూపి పరిష్కరించడం ఆనందంగా ఉందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చేలా కృషి చేశారని, ట్రైబ్యునల్ తీర్పు సంతోషాన్ని ఇచ్చిందని అన్నారు. న్యాయపరమైన అడ్డంకులు కొంతవరకు తొలగిపోయాయని అన్నారు. శ్రీకాకుళం జిల్లాకు సంబంధించి ఎప్పటి నుంచో నేరడి బ్యారేజీ నిర్మాణం ఒక ప్రతిపాదనగానే ఉందని, పొరుగు రాష్ట్రంతో ఉన్న చిన్న అడ్డంకి త్వరలోనే తొలగనుందని అచ్చెన్నాయుడు అన్నారు.

## వేణుగోపాల్‌కు సత్కారం

**శ్రీకాకుళం, ఏప్రిల్ 5 (వార్త):** ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్, గెజిటెడ్ ఉద్యోగుల సంఘం(ఏపి ఎన్జీజీఓ) రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా ఎన్నికైన రాయి వేణుగోపాల్‌ను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదివారం సత్కరించారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డా.బాబు జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవాల సందర్భంగా సన్ రైజ్ హోటల్ లో నిర్వహించిన కార్యక్రమంలో దళిత సంఘాల నాయకుల సమక్షంలో రాయి వేణుగోపాల్ ను మంత్రి అచ్చెన్నాయుడు దుశ్శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు. అలాగే శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ సైతం ఏపిఎన్ జీజీఓ ఉపాధ్యక్షుడుగా ఎన్నికైన వేణుగోపాల్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల జెఏసి నాయకులు తైక్వాండో శ్రీను, డా.కంఠ వేణు తదితరులు పాల్గొన్నారు.





## కిడ్నీ మార్పిడి బాధితురాలికి ఎమ్మెల్యే పరామర్శ

**పలాస, ఏప్రిల్ 5 (వార్త):** ఇటీవల కిడ్నీ రీసెర్చ్ ఆస్పత్రిలో మొట్టమొదటి కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స చేయించుకున్న హేమశ్రీని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదివారం పరామర్శించారు. ఆస్పత్రికి వెళ్లిన ఎమ్మెల్యే, హేమశ్రీ ఆరోగ్య పరిస్థితిని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. శస్త్రచికిత్స అనంతరం కోలుకుంటున్న తీరును వైద్యులతో చర్చించి, మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆస్పత్రి నుండి డిస్చార్జ్ అయిన తర్వాత కూడా ఆరోగ్యం పట్ల అత్యంత జాగ్రత్తగా ఉండాలని, వైద్యుల సూచనలు ఖచ్చితంగా పాటించాలని హేమశ్రీకి సూచించారు. బాధితురాలికి, ఆమె కుటుంబానికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కిడ్నీ రీసెర్చ్ ఆస్పత్రిలో మొట్టమొదటి కిడ్నీ మార్పిడి విజయవంతం కావడం ఈ ప్రాంత ప్రజలకు ఒక గొప్ప శుభపరిణామమని ఆమె కొనియాడారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనుల పరిశీలన



**పలాస, ఏప్రిల్ 5 (వార్త):** ఆఫ్షోర్ రిజ్వాయర్ పనులు సకాలంలో పూర్తి చేసి రైతులకు సాగునీటిని అందిస్తామని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. ఆదివారం ఆఫ్షోర్ రిజర్వాయర్ పనులను ఎమ్మెల్యే గౌతు శిరీష, నియోజకవర్గం సమన్వయకర్త వెంకన్న చౌదరి, టిడిపి నాయకులు, అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ చిత్తశుద్ధి ఏమిటంటే ఎన్నికల్లో గెలిచిన వెంటనే చూపించామన్నారు. అనుకున్న దానికన్నా ఆఫ్సోర్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. గత ఐదు సంవత్సరాలు పడకేసిన ఈ పనులు ఈ రెండు సంవత్సరాలుగా పరుగులు పెడుతోందన్నారు. ఈ ఖరీఫ్ సీజన్ నాటికి రైతులకు నీరు విడుదల చేస్తారని ప్రశ్నించగా, అందుకు డిఈ శేఖర్ బాబు మాట్లాడుతూ జూలై నాటికి వంశధార ప్రాజెక్టుకు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ పీరుకట్ల విఠల్, వంశధార సిబ్బంది, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వినూత్నంగా అడ్మిషన్ డ్రైవ్

**జలుమూరు, ఏప్రిల్ 5 (వార్త):** విద్యార్థుల తల్లిదండ్రులను ఆకట్టుకునేందుకు జలుమూరు మండలం టెక్కలిపాడు ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు వినూత్నంగా అడ్మిషన్ డ్రైవ్ నిర్వహించారు. శనివారం హెడ్‌మాస్టర్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా టెక్కలిపాడు, గొల్లపేట తదితర గ్రామాల్లో రిక్షాపై మైక్ సెట్ ఏర్పాటు చేసి ప్రచారం నిర్వహించారు. పాఠశాల విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న విద్య, సదుపాయాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ఉచిత పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, యూనిఫార్మ్ వంటి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలని తల్లిదండ్రులను ప్రోత్సహించారు. ఈ వినూత్న కార్యక్రమానికి గ్రామస్తులు మంచి స్పందన చూపగా, ఉపాధ్యాయుల ప్రయత్నాన్ని పలువురు అభినందించారు.

## ప్రత్యేకాధికారుల నియామకం

**సారవకోట, ఏప్రిల్ 5 (వార్త):** సారవకోట మండలంలోని 35 గ్రామ పంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమించినట్లు ఎంపీడీఓ మోహన్ కుమార్ తెలిపారు. ఈ నెల 2వ తేదీతో సర్పంచుల పదవీకాలం ముగియడంతో, మండలంలోని వివిధ శాఖల్లో పనిచేస్తున్న మండలస్థాయి అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమించినట్లు ఆయన వెల్లడించారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరిగేంత వరకు పంచాయతీల పాలన ఈ ప్రత్యేకాధికారుల ఆధ్వర్యంలో కొనసాగుతుందని తెలిపారు. గ్రామాల్లో పరిపాలన, అభివృద్ధి కార్యక్రమాలు అంతరాయం లేకుండా కొనసాగించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

## డివైడర్‌ను ఢీకొన్న బైక్

**నరసన్నపేట, ఏప్రిల్ 5 (వార్త):** నరసన్నపేట మండల కేంద్రంలోని స్థానిక సర్వీస్ రోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. శనివారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. జలుమూరు మండలం గుగ్గిలి గ్రామానికి చెందిన వెంకటరమణ బైక్‌పై గుండివిల్లిపేటలోని బంధువుల ఇంటికి వెళ్తుండగా, మార్గమధ్యంలో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్నట్లు సమాచారం. ఈ ప్రమాదంలో అతనికి తలకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని, 108 అంబులెన్స్ సాయంతో గాయపడిన వ్యక్తిని శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి

**శ్రీకాకుళం, ఏప్రిల్ 4 (వార్త):** భారతదేశ మాజీ ఉప ప్రధాని, స్వాతంత్ర్య సమరయోధుడు బాబు జగ్జీవన్ రామ్ జయంతిని డీసీసీ అధ్యక్షుడు సనపల అన్నాజీ రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం నిర్వహించిన సభలో డిసిసీ అధ్యక్షుడు మాట్లాడుతూ, బాబు జగ్జీవన్ రామ్ భారత స్వాతంత్ర్య సంగ్రామంలో కీలక పాత్ర పోషించారన్నారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా అనేకమంది జాతీయ నాయకులతో కలిసి పోరాడారన్నారు. స్వాతంత్ర్యం అనంతరం పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ మంత్రివర్గంలో కార్మిక మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ఆయన, తరువాత పలు కీలక మంత్రిత్వ శాఖలను నిర్వహిస్తూ విశేష సేవలు అందించినట్లు తెలిపారు. తన కృషి, నిబద్ధత, నిజాయితీతో అంచెలంచెలుగా ఎదిగి దేశ ఉప ప్రధానిగా సేవలందించిన గొప్ప నాయకుడని కొనియాడారు. ప్రత్యేకంగా అణగారిన వర్గాల అభ్యున్నత కోసం ఆయన చేసిన కృషి అమోఘమని, సామాజిక న్యాయం సాధనలో ఆయన పాత్ర అపూర్వమని పేర్కొన్నారు. ప్రస్తుత రాజకీయ నాయకులు ఆయనను ఆదర్శంగా తీసుకుని ప్రజాసేవలో నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మంత్రి నరసింహమూర్తి, బొడ్డేపల్లి గోవింద్ గోపాల్, మామిడి సత్యనారాయణ, ఆబోతుల వెంకటనాయుడు, దేశెల్ల మల్లిబాబు, కెవిఎల్ ఎస్ ఈశ్వరి, ఇజ్జురోతు రమణ, బస్వా షణ్ముఖరావు, బేరి వెంకటరమణ, కొత్తపల్లి రాంప్రసాద్, లఖినేని సాయిరామ్, బొడ్డేపల్లి శ్రీనివాస్, గొల్లపల్లి దాలయ్య, జి. రామారావు, బొడ్డేపల్లి శ్రీనివాసరావు, సోదవరం చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



# రియల్‌గా అక్రమ వ్యాపారం

- నిబంధనలకు విరుద్ధంగా వెంచర్లు
- ఇష్టారాజ్యంగా వెంచర్లు వేస్తూ దర్జాగా దగా
- ప్రజలను మోసగిస్తున్న రియల్ వ్యాపారులు
- సోంపేటలో కానరాని 'సుడా' చర్యలు

**సోంపేట, ఏప్రిల్ 5 (వార్త):** సోంపేట రియల్ వ్యాపారం పరిస్థితి ఆందోళనకరంగా మారింది. అధికార యంత్రాంగం ఉన్నప్పటికీ అనేక విషయాల్లో అంటీముట్టనట్టు వ్యవహరించడంతో ఈ పరిస్థితి రియల్ వ్యాపారులకు వరంలా మారుతోంది. దీన్ని అనేకమంది తీవ్రంగా తప్పుపడుతున్నారు. అధికారుల అలసత్వం... పాలకుల స్వార్థం.. రియల్ వ్యాపారుల ఇష్టారాజ్యం వెరసి ఇక్కడ రియల్ వ్యాపారం నిబంధనలకు విరుద్ధంగా అడ్డగోలుగా సాగుతోంది. రియల్ వ్యాపారులకు అడ్డుకట్ట వేసే పరిస్థితి అసలు లేకుండా పోతుంది. దీంతో ఇష్టారాజ్యంగా వెంచర్లు వేయడం ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఫీజులు పూర్తిగా ఎగ్గొట్టడం, గ్రామపంచాయతీకి కేటాయించాల్సిన స్థలాలను అసలు కేటాయించకపోవడం, లే అవుట్ లలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించకపోవడం వంటి పరిస్థితులు భవిష్యత్తులో సోంపేట అభివృద్ధిని చీకట్లోకి నెట్టివేస్తున్నాయి. సోంపేట మేజర్ పంచాయతీలో ఇటు జింకిభద్ర అటు బీరుసువాడ మరోవైపు బూరగాం ఇంకోవైపు కవిటి వెళ్లే రోడ్డు ఇలా ఎటువైపు చూసిన సోంపేట పట్టణంతోపాటు సోంపేట చుట్టుపక్కల రియల్ ఎస్టేట్ వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయని చెప్పడంలో ఏమాత్రం సందేహం లేదు. రియల్ ఎస్టేట్ వ్యాపారం బాగా జరిగితే ఆ ప్రాంతం ఒక అభివృద్ధి మోడల్‌గా భవిష్యత్తులో తీర్చిదిద్దబడుతోంది. ఇది స్వాగతించదగ్గ విషయమే అయినప్పటికీ నిబంధనల విషయంలో మాత్రం పూర్తిగా విస్మరిస్తూ ఇష్టారాజ్యంగా వెంచర్లు వేస్తూ దర్జాగా దోపిడీ చేస్తున్న పరిస్థితులు కళ్లెదుటే స్పష్టంగా కనిపిస్తున్న అధికారులు మాత్రం తమ అలసత్వాన్ని వీడకపోవడం ఇక్కడ విశేషం. రియల్ ఎస్టేట్ వెంచర్ల విషయంలో అనుమతులు,ఫీజులు మొదలైన వ్యవహారాలన్నీ చూడాల్సిన 'సుడా 'అధికారుల తీరు అత్యంత ఘోరంగా ఉందంటే అతిశయోక్తి కాదు. శ్రీకాకుళం కేంద్రంగా పనిచేస్తున్న సుడా అధికారులు సోంపేట వైపు కనీసం కన్నెత్తి చూడకపోవడంతో ఇక్కడ రియల్ వ్యాపారం ద్వారా వచ్చే



ఆదాయాన్ని ప్రభుత్వం పూర్తిగా కోల్పోతుంది. అక్రమంగా వెంచర్లు వేసి ప్రజలను మభ్యపెడుతూ సొమ్ము చేసుకోవడం ఇక్కడ వ్యాపారులకు వెన్నతో పెట్టిన విద్యగా మారింది. దీనిపై ఎన్ని ఫిర్యాదులు వస్తున్న పట్టించుకునే నాధుడు లేడంటే అతిశయోక్తి కాదు. పంచాయతీ, రెవిన్యూ అధికారులు కూడా రియల్ వ్యాపారుల జోలికి వెళ్లడం లేదు.సోంపేట చుట్టూ పుట్టగొడుగుల్లా వెలసిన వెంచర్ల విషయంలో రెండు మూడు తప్ప మిగతా వెంచర్లకు కనీస అనుమతులు లేకపోవడం గమనార్హం. ఇదిలా ఉండగా ప్రతి లేఅవుట్ నుంచి గ్రామపంచాయతీకి 10శాతం రిజర్వ్ స్థలాన్ని కేటాయిస్తూ పంచాయతీ పేరున రిజిస్ట్రేషన్ చేయించాల్సి ఉన్నప్పటికీ అటువంటి చర్యలు కనీసం కనిపించడం లేదు. ఈ పరిస్థితి భవిష్యత్తులో ప్రభుత్వ నిర్మాణాలకు ఇతరత్రా అవసరాలకు పెద్ద ప్రమాదంగా మారే అవకాశం ఉందంటూ పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి పరిస్థితులు ఒక సోంపేటకే పరిమితం కాకుండా మండలంలోని చాలా గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొని ఉంది. ఇటువంటి అక్రమ లేఔట్ల విషయంలో ఏ ఒక్క అధికారి కూడా కనీసం పట్టించుకునే పరిస్థితి లేదంటే పరిస్థితులు ఎంత ఘోరంగా ఉన్నాయో విశదమవుతుంది. మండలంలో బారువ, పలాసపురం, లక్కవరం, కొర్లాం, లక్ష్మీపురం, బుషాభద్ర,శారదాపురం వంటి పలు గ్రామాల్లో అక్రమ లేఅవుట్లు ఇష్టారాజ్యంగా వెలిసాయి.

### రిజర్వ్ స్థలాలపై కబ్జాదారుల కన్ను..

సోంపేట పట్టణంలో గతంలో వెంచర్లు వేసిన యజమానులు కొంత స్థలాన్ని గ్రామపంచాయతీకి రిజర్వ్ చేశారు. అటువంటి ఖాళీ స్థలాలపై కొంతమంది కబ్జాదారులు కన్ను పడింది. వాటిని కూడా కబ్జా చేసేందుకు వెనుకాడటం లేదు. పంచాయతీ కార్యదర్శి అటువంటి రిజర్వు స్థలాల్లో గ్రామపంచాయతీ పేరున బోర్డులు ఏర్పాటు చేస్తున్నప్పటికీ అవి రెండో రోజుకే తొలగించడం షరా మామూలు అయింది. సోంపేటలో రియల్ పరిస్థితి మెరుగుపడాలంటే అక్రమాలకు తెరదించాలంటే ముఖ్యంగా అధికారులు అలసత్వం వీడాలని,నేతల నుంచి రాజకీయ ఒత్తిళ్లు ఉండకూడదు అని పలువురు పేర్కొంటున్నారు.



# చెరువులు కబ్జా

- చెరువు గర్భంలోనే అక్రమ నిర్మాణాలు
- నోటీసులతోనే సరిపెడుతున్న అధికారులు



**నరసన్నపేట, ఏప్రిల్ 5 (వార్త):** నరసన్నపేట ప్రాంతంలో చెరువులు, కాలువలపై అక్రమ నిర్మాణాలు విస్తృతంగా పెరుగుతూ జలవనరుల భవిష్యత్తుపై ఆందోళన కలిగిస్తున్నాయి. కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నప్పటికీ, సంబంధిత అధికారుల నిర్లక్ష్యం ప్రజల్లో తీవ్ర ఆగ్రహాన్ని రగిలిస్తోంది. రాజకీయ ఆశ్రయం, అవినీతి ఆరోపణలు కూడా ఈ వ్యవహారంలో బలంగా వినిపిస్తున్నాయి. గొట్టిపల్లి సర్వే నంబర్ 94లో ఉన్న నరసన్న చెరువు ప్రస్తుతం ఆక్రమణలకు కేంద్రంగా మారింది. కాంప్లెక్స్ ఎదుట ఉన్న ఈ చెరువు గర్భాన్ని పూర్తిగా వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. చెరువు పరిమితులను పరిగణనలోకి తీసుకోకుండా భూమిపూజలు నిర్వహించి నిర్మాణాలు ప్రారంభించడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. చెరువు విస్తీర్ణం, నీటి ప్రవాహ మార్గాలను పూర్తిగా దెబ్బతీసే విధంగా చర్యలు కొనసాగుతున్నాయని ప్రజలు చెబుతున్నారు. జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో కూడా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. రాతికర్ర చెరువు, జలగల చెరువు, వంశధార కాలువ పరిధిలో విస్తృతంగా అక్రమాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా సర్వే నం.187లో సుమారు 2.75 ఎకరాల విస్తీర్ణం ఆక్రమణకు గురైందని ఆరోపణలు ఉన్నాయి. సర్వే నం.195 (రోడ్డు పోరంబోకు భూమి) కింద వరుసగా మూడు భారీ భవనాలు నిర్మించబడినట్లు సమాచారం. ఈ భూముల మార్కెట్ విలువ సుమారు రూ.60 నుంచి 70 కోట్ల వరకు ఉంటుందని అంచనా. ఇంత పెద్ద ఎత్తున నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ



సంబంధిత శాఖలు స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. పంచాయతీ, రెవెన్యూ అధికారులు కార్యాలయాలకు మాత్రమే పరిమితమై, భూఆక్రమణలను చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. గొట్టిపల్లి రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూములు, చెరువులు కబ్జాకు గురవుతున్నప్పటికీ కఠిన చర్యలు తీసుకోకపోవడం వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అక్రమ నిర్మాణాలకు అవసరమైన విద్యుత్ కనెక్షన్లు, ట్రాన్స్ఫార్మర్లు కూడా అనధికారికంగా ఏర్పాటు కావడం వెనుక భారీగా ముడుపులు చెల్లించబడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇది వ్యవస్థలో అవినీతి స్థాయిని బహిర్గతం చేస్తోందని స్థానికులు అంటున్నారు. చెరువులు, కాలువలను రక్షించాలని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్, హైకోర్టు, సుప్రీంకోర్టులు పలు మార్లు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ, స్థానిక స్థాయిలో అవి అమలు కావడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాల్లో ఏర్పాటు చేసిన వాచ్ కమిటీలు కూడా పేరుకే పరిమితమయ్యాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నరసన్నపేట పంచాయతీ ఈవో ద్రాక్షాయిని, ఎమ్మార్వో సత్యనారాయణ వ్యవహారంపై కూడా తీవ్ర విమర్శలు వస్తున్నాయి. కోట్ల విలువైన భూములు కబ్జాకు గురవుతున్నప్పటికీ అధికారులు కేవలం నోటీసులు ఇచ్చామని చెప్పి బాధ్యత నుంచి తప్పించుకుంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా కబ్జాదారులు మాత్రం ఎలాంటి భయాందోళనలు లేకుండా నిర్మాణాలను కొనసాగించడం పరిస్థితి ఎంత ప్రమాదకరంగా ఉందో స్పష్టం చేస్తోంది. ఇప్పటికైనా అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించి చెరువులను యథాస్థితికి తీసుకురాకపోతే, ప్రజలు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించి న్యాయపరమైన పోరాటానికి సిద్ధమవుతున్నట్లు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వ భూముల రక్షణలో విఫలమవుతున్న అధికారులపై ఉన్నతస్థాయి విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## ఎండిపోయిన వంశధార ఎడమ కాలువ



**సారవకోట, ఏప్రిల్ 5 (వార్త):** సారవకోట మండలం అక్కివలస సమీపంలోని వంశధార ఎడమ కాలువలో నీరు లేక పూర్తిగా ఎండిపోయింది. దీంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వంశధార నది హిర మండలం వద్ద అభివృద్ధి పనులు జరుగుతున్న కారణంగా అధికారులు కాలువలకు నీరు విడుదల చేయడం లేదని సమాచారం. దీని ప్రభావంతో కాలువలు అడుగంటి పోయి, సాగునీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. బద్రి, లక్ష్మీపురం, బుడితి తదితర గ్రామాల్లో రబీ సీజన్‌లో వరి సాగు చేస్తున్న రైతులు నీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంటలు ఎండిపోతాయేమోనని భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువలకు తక్షణం నీరు విడుదల చేసి రైతులను ఆదుకోవాలని, లేకపోతే భారీ నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## మురికికాలువగా వంశధార పంట కాలువ



**నరసన్నపేట, ఏప్రిల్ 5 (వార్త):** పంట పొలాలకు సాగునీరు అందించే వంశధార కాలువ ప్రస్తుతం మురికికాలువను తలపిస్తూ దుర్వస్థితికి చేరుకుంది. వ్యర్థ పదార్థాలతో నిండిపోవడంతో తీవ్ర దుర్గంధం వ్యాపించి పరిసర ప్రాంత ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జమ్ము జంక్షన్ నుంచి దేశవానిపేట శివారు వరకు విస్తరించిన ఈ పంట కాలువ, గతంలో రైతులకు ప్రధాన సాగునీటి వనరుగా ఉపయోగపడేది. అయితే ప్రస్తుతం చెత్త, వ్యర్థాలతో నిండి పోవడంతో కాలువ స్వరూపం పూర్తిగా మారిపోయింది. ప్రాంతంలోని హోటళ్లు, డాబాలు నిర్వాహకులు, అలాగే కొంతమంది స్థానికులు చెత్తను నిర్లక్ష్యంగా కాలువలో వేయడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందని ఆరోపణలు ఉన్నాయి. ఫలితంగా ఈ ప్రాంతం చిన్నపాటి డంపింగ్ యార్డును తలపిస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో సాగునీటి ప్రవాహం అడ్డంకులు ఎదుర్కొంటూ రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పర్యావరణానికి కూడా ముప్పు ఏర్పడుతోందని పేర్కొన్నారు. తక్షణమే కాలువను శుభ్రపరిచి, చెత్త వేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, సంబంధిత అధికారులను గ్రామస్తులు కోరుతున్నారు.

## తుప్పల నడుమ పోలింగ్ కేంద్రం



**సారవకోట, ఏప్రిల్ 5 (వార్త):** సారవకోట మండలంలోని అక్కివలస గ్రామంలో ఉన్న పోలింగ్ కేంద్రం పిచ్చి మొక్కల మధ్య నిర్లక్ష్యానికి గురైందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇక్కడ ఉన్న ప్రాథమిక పాఠశాలను 2016లో ఎత్తివేసి గుమ్మపాడు పాఠశాలలో విలీనం చేశారు. అప్పటి నుంచి ఆ పాఠశాల భవనాలను పోలింగ్ కేంద్రంగా ఉపయోగిస్తున్నారు. అయితే భవనం చుట్టూ పిచ్చి మొక్కలు విస్తరించి, చెత్త పేరుకుపోవడంతో అస్వచ్ఛ వాతావరణం నెలకొంది. పోలింగ్ కేంద్రంగా వినియోగిస్తున్న ప్రదేశం ఇలా నిర్లక్ష్యానికి గురవడం పట్ల స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా శుభ్రపరిచి, పరిసరాలను సక్రమంగా నిర్వహించాలని అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## కూలే దశలో వ్యవసాయ శాఖ కార్యాలయం



**నరసన్నపేట, ఏప్రిల్ 5 (వార్త):** నరసన్నపేట మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయం నేడు శిథిలావస్థకు చేరుకుని నిరుపయోగంగా మారింది. ఒకప్పుడు రైతులకు కీలక సేవలు అందించిన ఈ కార్యాలయం ప్రస్తుతం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. గతంలో ఈ కార్యాలయం ద్వారా రైతులు పంటల సమాచారం, ఎరువుల పంపిణీ, సలహాలు వంటి అనేక సేవలను పొందేవారు. అయితే ప్రభుత్వ మార్పుల తర్వాత సచివాలయాల పరిధిలో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేయడంతో ఈ కార్యాలయం ప్రాముఖ్యత కోల్పోయింది. రైతులు తమ అవసరాల కోసం ఇప్పుడు ఆ కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. దీంతో ఈ కార్యాలయం ఉపయోగం లేక మూలకు చేరిపోయి, ప్రస్తుతం చెత్త, వ్యర్థాలతో నిండిపోయి శిథిలావస్థకు చేరుకుంది. పరిసరాలు అస్వచ్ఛంగా మారి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి భవనాన్ని శుభ్రపరిచి, మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని లేదా ఇతర అవసరాలకు ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## పంచాయతీలకు ప్రత్యేక అధికారుల నియామకం

**పోలాకి, ఏప్రిల్ 5 (వార్త):** పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ముగియడంతో ప్రత్యేక అధికారుల నియామకంపై ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పోలాకి మండల ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న రవికుమార్‌ను స్పెషల్ ఆఫీసర్‌గా నియమించారు. ఆయనకు దీర్ఘాసి, మబగాం, పోలాకి పంచాయతీల బాధ్యతలను అప్పగించినట్లు అధికారులు తెలిపారు. ఆదేశాలు అందుకున్న వెంటనే రవికుమార్ శనివారం విధుల్లో చేరి పంచాయతీ పరిపాలనను పర్యవేక్షించడం ప్రారంభించారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## మరమ్మతులకు నోచని మండల రిసోర్స్ సెంటర్

**నరసన్నపేట, ఏప్రిల్ 5 (వార్త):** నరసన్నపేట మండల రిసోర్స్ సెంటర్ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భవనం మరమ్మతులకు నోచుకోకపోవడంతో కార్యాలయ కార్యకలాపాలు సక్రమంగా సాగడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఆరు సంవత్సరాల కిందటే ఈ భవనం ప్రమాదకర స్థితికి చేరుకోవడంతో, ఇక్కడ నిర్వహిస్తున్న ఎంఈఓ కార్యాలయాన్ని పక్కనే ఉన్న పాత ఎంపీడీవో కార్యాలయానికి తాత్కాలికంగా తరలించారు. అయితే అక్కడ కూడా సరైన సౌకర్యాలు లేకపోవడంతో సిబ్బంది అరకొర వసతులతో పని చేయాల్సి వస్తోందని తెలిపారు. ఈ కారణంగా కార్యాలయ సేవలు పూర్తిస్థాయిలో అందించలేకపోతున్నామని, విద్యా సంబంధిత పనులు ఆలస్యమవుతున్నాయని పేర్కొన్నారు. సిబ్బంది, ఉపాధ్యాయులు, ప్రజలు కూడా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తక్షణమే మండల రిసోర్స్ సెంటర్ భవనానికి మరమ్మతులు చేపట్టి, సౌకర్యవంతమైన వాతావరణంలో కార్యాలయాన్ని పునరుద్ధరించాలని సిబ్బంది కోరుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



# అనన్య సామాన్యం.. వీరగున్నమ్మ పోరాటం

* వీరగున్నమ్మ సాహసాన్ని కొనియాడిన వక్తలు
* పద్య, కవిత, పాటల పోటీల విజేతలకు సన్మానం
* హరిపురంలో ఘనంగా గున్నమ్మ వర్ధంతి

**మందస, ఏప్రిల్ 5(వార్త):** అనన్యసామాన్యం.. వీరగున్నమ్మ పోరాటమని పలువురు వక్తలు అన్నారు. మందస మండలంలోని హరిపురంలో స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ ఆఫీస్ లో ప్రజా విజ్ఞాన వేదిక, ప్రజా విజ్ఞాన సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో వీరగున్నమ్మ 86వ వర్ధంతి వారోత్సవాలు, పద్య, కవిత, పాటల పోటీలు జరిగాయి. వీరగున్నమ్మ స్వాతంత్ర్య సమరంలో పాల్గొనడానికి గల కారణాలను కూలకుషంగా వివరించారు. భాషా పరిజ్ఞానం లేని రోజులలో కూడా మహిళలు చదువు లేకపోయినా ఉద్యమాలలో ఆమె తెగువను తెలిపారు. జానపదాలనుంచి ఆమెచరిత్ర బయటపడింది అని ఋజువు చేసి చెప్పారు. జమిందారీ కుతంత్ర పన్నాగాలు,ఆధ్యాత్మికత ముసుగులో దోపిడీ చేసే విధానాన్నీ బాగా ఎండ గట్టి చెప్పారు. ఉద్యమ చరిత్రల గూర్చి, వాటిని భక్తి, మతము ముసుగులో నుంచి బైటకు రాకుండా మూఢ నమ్మకాలలో ప్రజలను ముంచుతున్నారని పాలకుల పై విరుచుకు పడ్డారు. మార్పు జగన్మోహనరావు అధ్యక్షతన సవర సోములయ్య కన్వీనర్ గా, ముఖ్య అతిథి గా బెందాలం కృష్ణారావు, గౌరవ అతిథి మట్ట ఖగేశ్వరరావు, వక్తలు మామిడి కోదండరావు, లోపింటి రజితేంద్రరెడ్డి, బత్తిన శాంతారావు, మెట్ట దామోదరం, జన్ని సంతోష్ కుమార్ లకు రాజ్యాంగ పుస్తకాలను ప్రోత్సాక బహుమతులుగా అందజేసి, సత్కరించారు. అదేవిధంగా పద్యాలు, కవితలు, పాటల పోటీల విజేతలకు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బద్రి కూర్మారావు, ముంజేటి కృష్ణారావు, శశిధర్ వర్మ, నెయ్యల లోకనాథం, బతకల చంద్రయ్య, కొర్రాయి ధర్మారావు, నల్ల హడ్డి, కోర్నాన ఉమాపతి, దాసరి ఈశ్వరరావు, మార్పు రవీంద్ర, మాదిన క్రాంతి కుమార్, దేవాడ నారాయణరావు, గొలుసు మురళీక్రిష్ణ, పి.కామేశ్వరరావు, బద్రి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.







## సొంత నిధులతో కల్వర్టు నిర్మాణం



**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 5 (వార్త):** కొఠారి పంచాయతీలో గతంలో మంజూరు అయిన కల్వర్టు పనులు మాజీ సర్పంచ్ దుక్క ధనలక్ష్మి సొంత నిధులతో పూర్తి చేస్తోంది. పదవీ కాలం పూర్తి కావడంతో పాటు గ్రామంలో యజ్ఞం కార్యక్రమం ఉండడంతో ఇంజనీరింగ్ అధికారులు రికార్డు చేయక పోవడంతో సొంత నిధులతో పని పూర్తి చేస్తున్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరు



**పలాస, ఏప్రిల్ 5 (వార్త):** పలాస మండలం రెంటికోటకి చెందిన డొక్కరి మోహిని, వజ్రపుకొత్తూరు మండలం బెండి గ్రామానికి తమ్మినాన చిరంజీవలుకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సిఎంఆర్ఎఫ్) ద్వారా ఆర్థిక సాయం అందజేశారు. అనారోగ్య కారణాలతో ఇబ్బంది పడుతున్న రామారావు ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకోగా, ప్రభుత్వం సానుకూలంగా స్పందించి నిధులను విడుదల చేసింది. పలాస నియోజకవర్గ ఎమ్మెల్యే గౌతు శిరీష చొరవతో ఈ నిధులు మంజూరయ్యాయి. తన కష్టకాలంలో అండగా నిలిచిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిరంతరం ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీషకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొని, ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరిష తీరును అభినందించారు.

## మహానేత బాబు జగజ్జీవన్ రామ్



**పలాస, ఏప్రిల్5 (వార్త):** భారతదేశ సామాజిక న్యాయ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన మహానేతని, స్వాతంత్ర్య సమరయోధుడు, అణగారిన వర్గాల అభ్యున్నతికి తన జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తి బాబు జగజీవన్ రామ్ ని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. బాబు జగజీవన్ రామ్ జయంతి సందర్భంగా ఆయనకు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాబు జగజ్జీవన్ రామ్ సామాన్య ప్రజల హక్కుల కోసం, ముఖ్యంగా దళితులు, వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసిన దూరదృష్టి కలిగిన నాయకుడని చెప్పారు. సమానత్వం, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణలో ఆయన చేసిన సేవలు భారతదేశ రాజకీయ, సామాజిక రంగాలకు చిరస్మరణీయమైనవని కొనియాడారు. ఈ కార్యక్రమంనకు పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## భారీ వాహనానికి జరిమానా

**ఇచ్ఛాపురం ఏప్రిల్5 (వార్త):** స్థానిక స్టేట్ బ్యాంక్ వికే పేట రోడ్డు లో ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించి ఆంక్షలు ఉన్న నిషేధ సమయంలో ప్రవేశించిన భారీ వాహనానికి 1035 రూపాయలు అపరాధ రుసుము విధించినట్లు సిఐ ఎం.చిన్నం నాయుడు చెప్పారు.



# గిరిజన విద్యకు కూటమి ప్రభుత్వం పెద్ద పీట

* గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు
* పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీష

**మందస, ఏప్రిల్ 5(వార్త):** గిరిజన విద్యకు కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని, గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తుందని పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీష అన్నారు. మందస మండలం డబార్సింగి గ్రామంలో పీఎం జన్ మన్ హాస్టల్ భవనాలను శిరీషా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రూ. 2.30కోట్ల వ్యయంతో మంజూరైన ఈ గిరిజన విద్యార్థుల హాస్టల్ భవనం భూమిపూజ చేసిన కేవలం 8 నెలల వ్యవధిలోనే పూర్తి చేయడం ఆనందంగా ఉందన్నారు. పనిని వేగంగా, నాణ్యతతో పూర్తి చేసిన కాంట్రాక్టర్‌ను అభినందించారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించేందుకు ఈ భవనం అన్ని సౌకర్యాలతో సిద్ధంగా ఉందని, 50 మంది విద్యార్థులకు ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని కల్పించిన కేంద్ర ప్రభుత్వం, కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. గిరిజన విద్యార్థులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. గత 22నెలల కాలంలో రూ.2వేల కోట్ల అభివృద్ధి నిధులతో నియోజకవర్గంలో అనేక కార్యక్రమాలు వేగంగా అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ ప్రాంత గిరిజన ప్రజలు, యువకులు అభివృద్ధి దిశగా కూటమి ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ పీరికట్ల విఠల్ రావు, మందస మండల అధ్యక్షుడు భావన దుర్యోధన, లబ్బ రుద్రయ్య, డొంకురు తిరుపతి, నవీన్ యాదవ్, సవర లకీయా, సవర రాజు, చంద్రశేఖర్, ప్రశాంత్, సంతోష్ పండా, సవర శివ, రత్నాల ప్రసాద్, హరికృష్ణ, బాలు ఇతర కూటమి నాయకులు, హిమబిందు కన్స్ట్రక్షన్స్ ముద్దాడ హర్షవర్ధన్, డీఈఈ సత్యం, ఏఈ బుచ్చిబాబు, స్థానిక మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేశారు.



# మూన్నాళ్ల ముచ్చటగా డిస్ప్లే బోర్డులు

* సోంపేట రైల్వే స్టేషన్లో మొరాయించిన వైనం

**సోంపేట, ఏప్రిల్ 5(వార్త):** సోంపేట రైల్వే స్టేషన్‌లో ఎంతోకాలంగా ఎదురుచూసిన డిస్ప్లే బోర్డుల ఏర్పాటు జరిగినప్పటికీ వాటి ప్రయోజనం కేవలం మూన్నాళ్ళ ముచ్చటగానే మిగిలిపోయింది. కొద్ది రోజులుగా రైలు నిలయంలో డిస్ప్లే బోర్డులు పనిచేయడం మానేశాయి. రైళ్లు రాకపోకల సమయంలో ప్రయాణికులు తమ భోగిలను వెతుక్కోవడానికి ఎంతో తికమక పడుతున్నారు. ఒకవైపు లగేజీలు మరోవైపు చిన్నపిల్లలతో ఏ భోగి ఎక్కడ వచ్చి ఆగుతుందో తెలియని అయోమయ పరిస్థితి ఇక్కడ నెలకొంది. దీనిపై స్టేషన్ అధికారులు సిబ్బంది ఇప్పటికీ ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో ప్రయాణికులు ఆగ్రహిస్తున్నారు. రైల్వే నిర్లక్ష్యాన్ని ప్లాట్ఫారం పైకి వచ్చే ప్రయాణికులు సర్వత్ర చర్చించుకుంటున్నారు. డిస్ప్లే బోర్డులు గత నెలలో ప్రారంభించి నేతలు సంబరాలు జరుపుకున్నారు. తమ హయాంలో కంచిలిలో గల రైలు నిలయంలో తామే అభివృద్ధి చేస్తామని ఎంతగానో చెప్పుకున్నారు. ఆ సందర్భంలో ఈ ప్రాంత ప్రజలు కూడా చాలా సంతోషించారు. నేతల కృషి పట్ల హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. కానీ కొద్ది రోజుల్లోనే డిస్ప్లే బోర్డులు మొరాయించడం పట్ల ప్రయాణికులు తీవ్ర ఆవేదనకు, అయోమయానికి గురవుతున్నారు. ప్లాట్ ఫారం పై రైలు వచ్చి ఆగే సందర్భాల్లో లగేజీలతో పరుగులు తీస్తున్న పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయి. సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకుని డిస్ప్లే బోర్డులను పునరుద్ధరించాలని అన్ని వర్గాలు కోరుతున్నాయి.



# పలాసలో పేట్రేగిపోతున్న భూకబ్జాదారులు

* కోర్టు ఆర్డర్ ఉన్న గ్యాంగ్‌తో దాడి * 16 సెంట్ల భూమి ఆక్రమణకుయత్నం
* యజమాని అడ్డుకోవడంతో ఘర్షణ * రక్షణ కోరుతూ పోలీసులు ఆశ్రయించిన భూయజమాని

**పలాస, ఏప్రిల్ 5 (వార్త):** పలాసలో భూవివాదాలు రోజురోజుకూ అధికమవుతున్నాయి. కోర్టు ఇంజెక్షన్ ఆర్డర్ ఉన్నప్పటికీ, అల్లరి ముకల గ్యాంగ్ వచ్చి భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నించారని బాధితుడు ఈశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. 16 సెంట్ల భూమిపై జరిగిన ఈ వివాదం ఘర్షణకు దారితీయడంతో ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడంతో యాజమాని పోలీసులను ఆశ్రయించాడు. బొడ్డపాడు రెవెన్యూ పరిధిలో భూకబ్జా వివాదం కలకలం రేపుతోంది. పలాసకు చెందిన తాళాను ఈశ్వరరావు దంపతులకు చెందిన 16 సెంట్ల భూమిపై కాశీబుగ్గ ప్రాంతానికి చెందిన కొందరు వ్యక్తులు కన్నేశారు. బాధితుడి ఆరోపణల ప్రకారం, తప్పుడు పత్రాలు సృష్టించి భూమిని కాజేయడానికి యత్నిస్తున్న ఆక్రమణదారులు గ్యాంగ్ వచ్చి ఫెన్సింగ్ వేయడంతో పాటు పిల్లర్లు ఏర్పాటు చేయడానికి ప్రయత్నించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని గుర్తించిన ఈశ్వరరావు వెంటనే అక్కడికి చేరుకుని పనులను అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుని, పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. కొంత సేపు ఘర్షణ వాతావరణం నెలకొనడంతో భయాందోళనకు స్థానికులు గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. ఇరు వర్గాలను పోలీస్ స్టేషన్కు పిలిపించి విచారణ చేపట్టారు. ఇదిలా ఉండగా తనకు అనుకూలంగా కోర్టు ఇంజెక్షన్ ఆర్డర్ ఉన్నప్పటికీ ఆక్రమణదారులు బెదిరింపులు ఆపడం లేదని ఈశ్వరరావు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్యాంగ్ దాడులతో ప్రాణహాని భయం ఉందని, తక్షణమే తనకు రక్షణ కల్పించాలని పోలీసు అధికారులను వేడుకుంటున్నారు. ఈ ఘటనతో పలాస ప్రాంతంలో భూవివాదాలపై మళ్లీ చర్చ మొదలైంది. అధికారులు ఈ వ్యవహారాన్ని సీరియస్ గా తీసుకుని కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.







## యారబాడులో సరస్వతి విగ్రహ ఆవిష్కరణ

**నరసన్నపేట, ఏప్రిల్ 5 (వార్త):** నరసన్నపేట మండలం యారబాడు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన సరస్వతి దేవి విగ్రహాన్ని ఆదివారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి నరసన్నపేట శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి, నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విగ్రహాన్ని ఏర్పాటు చేసిన దాత ఉరిటి కిరణ్‌ను ఈ సందర్భంగా అభినందిస్తూ, విద్యకు దేవతగా భావించే సరస్వతి అమ్మవారి విగ్రహం విద్యార్థుల్లో జ్ఞానాభివృద్ధికి ప్రేరణగా నిలుస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పాఠశాలలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో విద్యపై ఆసక్తి పెరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బలివాడ దయానిధి, రిటైర్డ్ విద్యాశాఖ అధికారి బలివాడ మల్లేశ్వరరావు మాట్లాడుతూ, పాఠశాలల్లో సాంస్కృతిక, ఆధ్యాత్మిక వాతావరణం విద్యార్థుల అభివృద్ధికి తోడ్పడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలాకి పిఎసిఎస్ ఛైర్మన్ భైరి భాస్కరరావు, వంశధార డిస్ట్రిబ్యూటరి కమిటీ చైర్మన్ శిమ్మ చంద్రశేఖర్, మండల పార్టీ అధ్యక్షుడు అడపా చంద్రశేఖర్, యూనిట్ ఇంచార్జి శిమ్మ జగన్నాథం, జిల్లా కార్యదర్శి పూతి రమణ, మాజీ సర్పంచ్ పూతి నర్సయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ సురవరపు వెంకటరమణ, ముద్దాడ మల్లికార్జునరావు, దుంగ ప్రసాద్, మండల విద్యాశాఖ అధికారులు దాలినాయుడు, శాంతారావు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## శిథిలావస్థలో సీఐ క్వార్టర్స్



**నరసన్నపేట, ఏప్రిల్ 5 (వార్త):** నరసన్నపేటలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన సీఐ నివాస భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో వినియోగానికి పనిక రాకుండా పోయింది. దీంతో సీఐలు అధికారిక నివాసంలో ఉండలేక అద్దె ఇళ్లలో నివసించే పరిస్థితి ఏర్పడింది. సుమారు 15 సంవత్సరాల క్రితం స్థానిక సీఐ కార్యాలయం సమీపంలో ఈ భవనాన్ని నిర్మించారు. అయితే నిర్మాణం పూర్తైన కొద్ది కాలంలోనే భవనం దెబ్బతిని, శిథిలావస్థకు చేరుకుందని సమాచారం. భద్రతా కారణాల దృష్ట్యా ఇందులో నివాసం ఉండటం సాధ్యం కాకపోవడంతో ఉపయోగం లేకుండా వదిలేశారు.

## నేడు మందసలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

**మందస, ఏప్రిల్ 5(వార్త):** మందస పట్టణంలో ఈనెల 6న భారతీయ జనతాపార్టీ 46 ఆవిర్భావ దినోత్సవాలు నిర్వహించనున్నట్టు పార్టీ నాయకులు చెప్పారు. దేశ వ్యాప్తంగా జరుగుతున్న పతాకావిష్కరణ కార్యక్రమంలో భాగంగా సోమవారం మధ్యాహ్నం 3గంటలకు మందస పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో పతాకావిష్కరణ కార్యక్రమం, భారతీయ జనతా పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజశ్వరరావు హాజరువుతున్నారని, భారతీయ జనతా పార్టీ కుటుంబసభ్యులు, పలాస నియోజకవర్గంలోని అన్ని మండలాల అధ్యక్షులు, కమిటీ సభ్యులు, ప్రస్తుత, పూర్వ రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందరూ హాజరై కార్యక్రమం జయప్రదం చేయాలని వారు కోరారు.

## పంచాయతీ స్పెషల్ ఆఫీసర్లు వీరే

**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 5 (వార్త):** ఇచ్ఛాపురం మండలం పంచాయతీ సర్పంచ్ ల పదవీకాలం పూర్తి కావడంతో స్పెషల్ అఫీసర్లు ను నియమించారు.బూర్జపాడు కేసుపురం ఈదుపురం పంచాయతీలకు ఎంపిడిఓ ఏ. ప్రభాకర రావు, ధర్మపురం, కొఠారి తులసిగాం లకు పంచాయతీ రాజ్ ఏ ఈ బి.హిమ సాగర్, బాలకృష్ణాపురం నకు డిప్యూటీ ఎంపిడిఓ లక్ష్మణ రావు,బిర్లాంగి ,టి.బరంపురం లొద్దపుట్టి నకు ఏ ఓ రామారావు, కీర్తి పురం మశాఖ పురం,పాయితారి నకు అర్ డబ్ల్యు ఎస్ ఏ ఈ విష్ణు మూర్తి, కేదారిపురం ముచ్చింద్ర నకు డిప్యూటీ ఎంపిడిఓ ఎం.రాజేష్, అరకబద్ర బొడ్డబడా కొలిగాం నకు వ్యవసాయ అధికారి అజయ్ కుమార్,మండపల్లి నకు తహశీల్దార్ వెంకట రావు, హరిపురం తెలుకుంచినకు డిప్యూటీ తహశీల్దార్ శ్రీవారిలను నియమించారు.

## చిన్నారి వైద్యానికి ఆర్థిక సాయం

**ఇచ్ఛాపురం ఏప్రిల్ 5 (వార్త):** ఇచ్ఛాపురం మండలం లొద్దపుట్టుగ గ్రామానికి అంబుగం వీధికి చెందిన ఇసురు దానయ్య శ్రావణి దంపతుల చిన్నారి ప్రాణాల కోసం పోరాడుతోంది. ఆ పాపకి అత్యవసర ఆపరేషన్ అవసరం ఉంది. క్లిష్ట సమయంలో జి ఎస్ ఫౌండేషన్ సహాయాన్ని ఆశ్రయించారు. ఫౌండేషన్ సభ్యుడు తిప్పన సురేష్ 20000 రూపాయలు ఆర్థిక సహాయం చేశారు.



## క్రీస్తు పునరుత్థాన వేడుకలు



**ఇచ్ఛాపురం, ఏప్రిల్ 5 (వార్త):** యేసుక్రీస్తు శిలువపై మరణము చెంది ఆదివారము పునరుత్థానుడైన సంఘటనను క్రైస్తవులందరు భక్తి శ్రద్ధలతో ఆచరించారు. దీనినే ఈస్టర్ సండేగా పిలుస్తారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వైస్సార్సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ కార్యదర్శి డాక్టర్ ప్రత్తి అన్వేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డాక్టర్ కొత్త పల్లి, నాగరత్నం, నవీన్ కుమార్, జోగారావు, చిరంజీవి రావు. జనార్ధన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## పలాసలో చినుకు పడితే చిత్తడే

**పలాస, ఏప్రిల్ 5 (వార్త):** పలాసలో చినుకు పడితే చిత్తడే ఉంటుందని, దీంతో ప్రజలు ఆరోగ్యానికి ముప్పు ఏర్పడుతుందని వైస్సార్ కాంగ్రెస్ పార్టీ, పట్టణ అధ్యక్షులు గోపీ.శిష్టు ఆవేదన వ్యక్తం చేశారు. పలాసలో ఆదివారం సాయంత్రం కుడిచిన వానకు పలాస-కాశీబుగ్గ పట్టణంలో పలు ప్రాంతాల్లో పారిశుధ్యం నిర్వహణ లోపం వలన చిన్న పాటి వర్షం పడిన డ్రైనేజీ మురికినీరు రోడ్డుపై ప్రవహించి దుర్గంధం వేదజల్లుతు ప్రజా ఆరోగ్యానికి, ప్రజా రవాణాకు ముప్పు వాటిల్లుతుందని ప్రజలు వాపోతున్నారు. తక్షణమే మునిసిపల్ అధికారులు పట్టణ పారిశుధ్యం నిర్వహణ పైన దృష్టి సారించి ప్రజా ఆరోగ్యాన్ని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## గేటు వద్ద ఆగిన గూడ్సు

**పలాస, ఏప్రిల్ 5 (వార్త):** కాశీబుగ్గలోని ఎల్‌సీ గేట్ వద్ద గూడ్స్ రైలు నిలిచిపోవడంతో ఆదివారం సుమారు గంటపాటు ట్రాఫిక్ తీవ్రంగా అంతరాయం ఏర్పడింది. విశాఖపట్నం నుండి ఒడిశా వైపు వెళ్తున్న గూడ్స్ రైలు మధ్యలో నిలిచిపోవడంతో గేట్ పూర్తిగా మూసివేయబడింది.దీంతో రహదారి ఇరువైపులా వాహనాలు భారీగా నిలిచిపోయాయి. బస్సులు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు కిలోమీటర్ల మేర క్యూలుగా నిలిచిపోవడంతో ఉద్యోగాలకు, వ్యాపారాలకు వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొంతమంది ప్రయాణికులు అసహనానికి గురయ్యారు. గంట తర్వాత రైలు కదలడంతో గేట్ తిరిగి తెరుచుకోవడంతో వాహనం చోదుకులు ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం ట్రాఫిక్ క్రమంగా సవ్యస్థితికి చేరుకుంది. స్థానికులు ఇలాంటి ఘటనలు తరచుగా జరుగుతున్నాయని, శాశ్వత పరిష్కారం కోసం అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.





## మానవత్వంలో మానవత

* వేసవిలో జాగ్రత్తలు పాటించాలి * డీఎస్పీ సీహెచ్ వివేకానంద
* ఉచిత మజ్జిగ పంపిణీలో మునిసిపల్ కమిషనర్

**శ్రీకాకుళం, ఏప్రిల్ 4 (వార్త):** మానవత్వంలో మానవత స్వచ్ఛంద సంస్థ నిలుస్తుందని శ్రీకాకుళం డిఎస్పీ సి.హెచ్. వివేకానంద అన్నారు. శ్రీకాకుళం మానవత స్వచ్ఛంద సంస్థ చైర్మన్ ప్రొఫెసర్ డా.విష్ణుమూర్తి ఆధ్వర్యంలో, స్థానిక ఏడు రోడ్ల కూడలిలో మజ్జిగ పంపిణీతోపాటు, చలివేంద్రాలని ప్రారంభించారు. ముఖ్యఅతిథులుగా పాల్గొన్న డిఎస్పీ సి.హెచ్. వివేకానంద, మునిసిపల్ కమిషనర్ కూర్మారావులు మాట్లాడుతూ మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రజల దాహార్తిని తీర్చటం గొప్పవిషయమన్నారు. వేసవి దృష్ట్యా, బాటసారులకు, గర్భిణీలకు, చిన్నారులకు, వృద్ధుల కోసం ఈ శిబిరాన్ని ప్రారంభించారన్నారు. ఈ సదావకాశాన్ని ప్రతీ ఒక్కరూ వినియోగించుకోవాలని, వేసవిలో నీళ్లు ఎక్కువగా తీసుకొని జాగ్రత్త వహించాలన్నారు. అనంతరం మానవత అధ్యక్షులు బరాటం లక్ష్మణ రావు, కార్యదర్శి నాగరాజు పాణిగ్రహి మాట్లాడుతూ మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నిరుపేదల కోసం నిరంతరం శ్రమిస్తుందని, ఉచిత స్వర్గధామ రథం, ఫ్రీజర్ బాక్స్, ఉచిత అంత్యక్రియలు, రక్తదాన శిబిరాలు, ఉచిత ఆక్సిజెన్ కాన్సన్ట్రేట్ లను అందిస్తామన్నారు. ఈ సేవా కార్యక్రమంలో సీనియర్ సభ్యులు టెక్కం రామ్ గోపాల్, ఉర్లం శివతేజ పట్నాయక్, సభ్యులు ఆర్కే పట్నాల, రాధారాణి, జయలక్ష్మి, రమేష్, స్థానికులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి రూ.4 లక్షలు చొప్పున పరిహారం

**శ్రీకాకుళం, ఏప్రిల్ 5(వార్త):** మందస మండలం పెద్దకేసుపురంలో పిడుగు పడిన విషాద ఘటనలో ఇద్దరు మృతి చెందడం పట్ల రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ఆయన గాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరపున మృతుల కుటుంబానికి రూ.4 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను మంత్రి అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తెలుసుకున్నారు. అలాగే పలాస శాసన సభ్యురాలు గౌతు శిరీషతో ఫోన్‌లో మాట్లాడి, పరిస్థితులను సమీక్షించారు. బాధిత కుటుంబాలకు అన్ని విధాల సహాయం అందించాల్సిందిగా అధికారులను ఆదేశించారు.

## బీసీ రిజర్వేషన్లపై అభిప్రాయాల సేకరణ

* ఈనెల 30 వరకూ గడువు

**శ్రీకాకుళం, ఏప్రిల్ 5(వార్త):** రాష్ట్రంలోని స్థానిక సంస్థల్లో వెనుకబడిన తరగతుల రిజర్వేషన్ల ఖరారుకు సంబంధించి ప్రభుత్వం 'డెడికేటెడ్ కమిషన్'ను నియమించిందని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 'ట్రిపుల్ టెస్ట్' నిబంధనలను అనుసరిస్తూ, బీసీల వెనుకబాటుతనంపై సమగ్ర అనుభవాధారిత విచారణ చేపట్టేందుకు కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసిందని ఆయన పేర్కొన్నారు. రిటైర్డ్ ఐ.ఏ.ఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా అధ్యక్షతన ఏర్పడిన ఈ కమిషన్, క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను అంచనా వేసేందుకు వివిధ స్టేక్ హోల్డర్లు, సంస్థలు, వ్యక్తుల నుండి లిఖితపూర్వక వినతిపత్రాలను ఆహ్వానిస్తోందని వివరించారు. ఈ అంశంపై అవగాహన ఉన్న వారు తమ వినతిపత్రాలను ఈ నెల 30వ తేదీలోపు రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా 'సెక్రటరీ, డెడికేటెడ్ కమిషన్, డైరెక్టర్ ఆఫ్ ట్రైబల్ వెల్ఫేర్ కార్యాలయం, 1వ అంతస్తు, మొఘల్రాజపురం, విజయవాడ - 520010' చిరునామాకు పంపాలన్నారు. అలాగే apbcdedicatedcommission2026@gmail.com ఈమెయిల్ ద్వారా కూడా వివరాలు పంపవచ్చని చెప్పారు. ప్రత్యక్షంగా కలిసి వినతిపత్రాలు సమర్పించాలనుకునే వారు కమిషన్ కార్యదర్శిని (మొబైల్: 9010400500) లేదా సంబంధిత అధికారిని (మొబైల్: 7989344521) సంప్రదించి ముందస్తు అపాయింట్‌మెంట్ తీసుకోవాలని ఆయన వెల్లడించారు.

## నెమలి నారాయణపురం వద్ద రోడ్డు ప్రమాదం

* వాహనం ఢీకొని ఇన్నోవా పల్టీ * ముగ్గురికి తీవ్ర గాయాలు



**పలాస, ఏప్రిల్ 5 (వార్త):** పలాస మండలంల నెమలి నారాయణపురం వద్ద ఆదివారం రాత్రి రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఇన్నోవా వాహనంలో పర్లాకిమిడికి చెందిన ముగ్గురు వ్యక్తులు పూరి వెళ్లి తిరిగి వస్తున్నారు. ఆదివారం సాయంత్రం వర్షం కురియడంతో వీరి వాహనానికి ఎదురుగా మరో వాహనం ఢీకొంది. దీంతో వారి వాహనం డివైడర్‌ను ఢీకొని పక్కనే ఉన్న పొలంలోకి పల్టీ కొట్టింది. అందులో ప్రయాణిస్తున్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వీరికి 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు. వీరిలో ఇద్దరు పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం రిమ్స్‌కు తరలించారు. కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# సిరిసువాడ రోడ్డు నిర్మాణంపై..

# హామీలు..గోవింద!

* వంద రోజుల్లో రోడ్డు ఎన్నికల స్టంట్ * హామీ ఇచ్చిన నేత ఇప్పుడెక్కడ? * ఆయన తీరుపై సిరిసువాడ గ్రామస్థుల ఆగ్రహం * మరోసారి రోడెక్కి నిరసన * పవనన్న.. మా రోడ్డుపై దృష్టిపెట్టన్నా అంటున్న సిరిసువాడ గ్రామస్థులు



**కొత్తూరు, ఏప్రిల్ 5 (వార్త):** ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నీటి మూటలుగానే మిగిలిపోవడంతో, విసిగిపోయిన సిరిసువాడ గ్రామస్తులు మరోసారి రోడ్డెక్కారు. "ఓట్ల కోసం రోడ్డును ఎరగా వాడారు తప్ప.. మా కష్టాలను తీర్చే నాథుడే కరువయ్యారు" అంటూ వారు అధికారులపై, ప్రజా ప్రతినిధులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఓ ప్రముఖ నాయకుడు సిరిసువాడ - కుంటిభద్ర రోడ్డును కేవలం 100 రోజుల్లో పూర్తి చేస్తానని భారీ బహిరంగ సభలో హామీ ఇచ్చారు. ఎంతో ఆర్భాటంగా శిలాఫలకం వేసి శంకుస్థాపన చేశారు. నేటికీ ఆ పనులు అడుగు కూడా ముందుకు పడలేదు. ఆనాడు హామీ ఇచ్చిన నాయకులు ఇప్పుడు కనీసం ఇటువైపు కన్నెత్తి చూడకపోవడంపై గ్రామస్తులు మండిపడుతున్నారు. అయితే ఈ రోడ్డు పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ క్షేత్రస్థాయిలో ఎక్కడా కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. స్వల్ప వర్షం కురిసినా ఈ రోడ్డు మొత్తం చిత్తడిగా మారి, రాకపోకలు నిలిచిపోయాయి. అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రికి వెళ్లాలన్నా ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యను పరిష్కరించే వారు లేక అల్లాడిపోతున్న సిరిసువాడ ప్రజలు, ఇప్పుడు తమ ఆఖరి ఆశగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వైపు చూస్తున్నారు. "మా బతుకుల్లో మార్పు వస్తుందని ఆశిస్తున్నాం.. పవనన్న ఒక్కసారి మా గ్రామం వైపు చూసి, మా గోడు వినాలి" అని ఆ గ్రామస్తులు వేడుకుంటున్నారు.





# పట్టు మహాదేవి కోనేరుకు మహర్దశ

* రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

**టెక్కలి, ఏప్రిల్ 5(వార్త):** టెక్కలి పట్టణానికి మణిహారంగా నిలిచిన పట్టు మహాదేవి కోనేరు త్వరలోనే ఆధునిక సౌకర్యాలతో నూతన రూపుదాల్చనుంది. సుమారు రూ.6 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సమగ్ర అభివృద్ధి ప్రణాళికను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సమీక్ష నిర్వహించారు, పనులు అత్యున్నత నాణ్యతతో చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సబ్ కలెక్టర్ పెట్రోల్ బంక్ ప్రారంభం అనంతరం కోనేరు అభివృద్ధి నమూనా వీడియోను మంత్రి సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కోనేరు అభివృద్ధి పనులపై ఆర్డీఓ కృష్ణమూర్తి వివరణ ఇవ్వగా, ప్రతి అంశం ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని మంత్రి స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా బలమైన రక్షణ గోడ, సుందరమైన వాకర్స్ ట్రాక్, పచ్చదనంతో నిండిన పార్క్ వాతావరణం, సందర్శకులకు అవసరమైన సౌకర్యాల ఏర్పాటు వంటి అంశాలు ఉండనున్నాయి. కోనేరు చుట్టూ ఆహ్లాదకరమైన వాతావరణాన్ని సృష్టిస్తూ, ప్రజలకు విశ్రాంతి, వినోదానికి అనువైన కేంద్రంగా తీర్చిదిద్దనున్నారు. నాణ్యతలో ఎక్కడా రాజీపడకుండా, ప్రజలకు కొత్త అనుభూతిని కలిగించేలా పనులు పూర్తి చేయాలని మంత్రి అచ్చెన్నాయుడు అధికారులకు స్పష్టం చేశారు.

## అనర్హులను జాబితా నుంచి తొలగిస్తాం

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఇళ్ల పట్టాలు మంజూరు చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అనర్హులు ఉంటే వారిపేర్లను జాబితా నుంచి తొలగిస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. టెక్కలి పరిధిలోని జగతిమెట్ట కాలనీని సందర్శించిన మంత్రి, అక్కడి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో ఇళ్ల పట్టాల పంపిణీ సమయంలో అనర్హులు కూడా లబ్ధిదారుల జాబితాలో చేరినట్లు అధికారులు గుర్తించారన్నారు. వారిని తొలగిస్తామన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ టెక్కలి ఆర్డీవో కార్యాలయానికి వెళ్లి తమ వద్ద ఉన్న సంబంధిత పత్రాలను చూపించుకోవాలన్నారు. అర్హులైన ఏ ఒక్కరికీ అన్యాయం జరగదని తెలిపారు.





## ఫిల్లింగ్ స్టేషన్ ప్రారంభం

టెక్కలిలో నూతనంగా నిర్మించిన రెవెన్యూ పెట్రోల్ బంక్‌ను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన ఇంధన సేవలు అందించడమే లక్ష్యంగా రెవెన్యూ ఆధ్వర్యంలోని పెట్రోల్ బంక్‌ను ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివర ప్రసాద్, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546